సాక్షి నిజామాబాద్

ఆదివారం । 24 । మార్చి । 2024



పిడిగుద్దుతో వసంతోత్సవం

సాలూర మండలం హున్సా గ్రామంలో హోలీ సందర్భంగా పిడిగుద్దులాట నిర్వహించను న్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేశారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
37.9 /22.9

వాతావరణం

ఉదయం ప్రకాశవంతంగా ఉంటుంది. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్క పోత ఇబ్బందిపెడుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'ఓట్ ఫ్రం హోం'కు అర్హులపై ఆరా

మోర్తాడ్(బాల్కొండ): పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో 'ఓట్ ఫ్రం హోం' కు ఎంతమంది అర్హులో బూత్ లెవల్ అధికారులు ఇప్పటి నుంచే వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలోని 1,549 పోలింగ్ బూత్‌లలో 80 ఏళ్ల వయస్సు పైబడినవారు, దివ్యాంగులైన వారిని గుర్తించి వారితో ఇంటి నుంచి ఓటు వేయించడానికి దరఖాస్తులను స్వీకరించే పనిలో పడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో 2,418 మంది 'ఓట్ ఫ్రం హోం'కు దరఖాస్తు చేసుకోగా 2,003 మంది ఇంటి నుంచి ఓట్లు వేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో మరి కొంత మంది అర్హుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని బీఎల్‌వోలు చెబుతున్నారు. ఎన్నికల్లో వంద శాతం ఓటింగ్ లక్ష్యంగా ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది.

సొసైటీకి తాళం వేసిన రైతులు

- అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్



కమ్మర్‌పల్లి: మండలంలోని కోనసముందర్ సొసైటీలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని పాలకవర్గ సభ్యులు, రైతులు డిమాండ్ చేశారు. శనివారం చైర్మన్ సామ బాపురెడ్డి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. సభలో సొసైటీ సీఈవో రాజేశ్వర్ చేసిన అక్రమాలపై రైతులు నిలదీశారు. ధాన్యం కొనుగోళ్లు, యూరియా విక్రయాలపై వచ్చిన కమీషన్ వివరాలు తెలపాలని డిమాండ్ చేశారు. సీఈవో అక్రమాలకు పాల్పడినట్లు రైతులు ఆరోపించారు. అనంతరం పాలకవర్గ సభ్యులు, రైతులు కలిసి సొసైటీ అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని తీర్మానం చేశారు. అనంతరం లెక్కలు తేలే వరకు సొసైటీ తెరవకూడదని తాళం వేశారు.

26న జాబ్‌మేళా

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని ప్రభుత్వ బాలికల ఐటీఐ కాలేజీలో ఈ నెల 26న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా ట్రేడ్ పూర్తి చేసిన బాలికలు అర్హులని పేర్కొన్నారు. మనోహరాబాద్‌లోని ఐటీసీ కంపెనీలో ఉద్యోగాలకు మంగళవారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



మాక్లూర్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి రసూల్‌బీ సూచించారు. మండలంలోని అమరావతి గ్రామంలో శనివారం జరిగిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు వ్యక్తిగత శుభ్రతతో పాటు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీవో జై క్రాంతి, తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్ మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నిజామాబాద్‌కు ఈడీ ?

- ఎమ్మెల్సీ కవిత అరెస్టు నేపథ్యంలో రానున్నట్లు సమాచారం
- వివరాలు సేకరిస్తున్న సెంట్రల్ ఇంటెలిజెన్స్ అధికారులు



ఖలీల్‌వాడి: 'ఢిల్లీ లిక్కర్' కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టయిన నేపథ్యంలో నిజామాబాద్‌లోనూ ఆమె ఆస్తులు, వ్యవహారాలపై సెంట్రల్ ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నట్లు సమాచారం. కవిత భర్త అనిల్ వ్యాపార లావాదేవీలు, వారికి సన్నిహితంగా ఉన్నవారి వివరాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కవితకు అనుకూలంగా వ్యవహరించినట్లు భావిస్తున్న జిల్లాలో కీలక స్థానంలో పనిచేసిన, ప్రస్తుతం బదిలీ అయిన అధికారితో పాటు ఓ రెవెన్యూ ఉద్యోగి పాత్రపైనా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఆస్తులకు సంబంధించిన బినామీలు ఎవరైనా ఉన్నారా ? అనే కోణంలోనూ విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ వివరాల సేకరణ పూర్తయిన తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్లు (ఈడీ) ఎప్పుడైనా నిజామాబాద్ వచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.


సిరికొండ మండలం హుస్సేన్‌నగర్‌లో నెర్రెలు బారిన పొలం



పొలం ఎండే గుండె పగిలే!

భూగర్భజలాలు గణనీయంగా అడుగంటడంతో యాసంగిలో సాగు చేసిన వరి పంట ఎండుముఖం పడుతోంది. మడులు బీటలు వారుతున్నాయి. బోరుబావులు వట్టిపోయి నీరు ఎత్తిపోయడం లేదు. వట్టి మోటార్లే తిరుగుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాలకు ఇప్పటి వరకు మూడు విడతల్లో ఎరువులు వేశామని, కలుపు తీయించామని, తెగుళ్లు సోకితే పురుగు మందులు స్ప్రే చేశామని.. మరో నెలన్నరలో కోత కోసుకోవాల్సి ఉండగా చేతికందకుండా ఎండిపోతున్నాయని, వేల రూపాయల పెట్టుబడి నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

- రైతన్న కన్నీటి కథ
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- ఎత్తిపోతున్న బోరుబావులు
- నెర్రలు బారుతున్న మడులు
- వందల ఎకరాల్లో వరికి అందని నీటి తడులు



సిరికొండ: ఈ యాసంగిలో సిరికొండ మండలంలో 20 వేలకు పైగా ఎకరాల్లో వరి, 450 ఎకరాల్లో ఎర్రజొన్న, 370 ఎకరాల్లో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, ఉల్లి తదితర పంటలను సాగు చేశారు. వరి పొలాలు నాటిన తర్వాత చలి తీవ్రత పెరగడంతో పొలాలు ఎదగలేకపోయాయి. దీనికి తోడు చీడపీడల ఉధృతితో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పొలాలను కాపాడుకోవడానికి వేలాది రుపాయలు వెచ్చించి పురుగు మందులను స్ప్రే చేసి కంటికి రెప్పలా కాపాడుకున్నారు. పొలాలు ఇప్పుడిప్పుడే బాగా ఎదిగి పొట్ట దశకు చేరుతున్నాయి. ఇంతలోనే భూగర్భజలాలు తగ్గుముఖం పట్టాయి. సాగునీరు అందక పంటలు ఎండిపోతుండటంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. ఈ ఏడాది వర్షాలు మోస్తారుగా కురిసి చెరువులు పూర్తి స్థాయిలో నిండి అలుగులు పారాయి. వాగులు పొంగి ప్రవహించాయి. నమ్మకంతో రైతులు యాసంగిలో భారీ స్థాయిలో పొలాలను సాగు చేశారు.అయితే కొన్ని గ్రామాల్లో పొలాలు పొట్ట దశకు చేరుకోకముందే, మరి కొన్ని గ్రామాల్లో పొలాలు ఈనిన తర్వాత భూగర్భజలాలు అడుగంటి ఎండిపోతున్నాయి.

వెయ్యి ఫీట్లు తవ్వినా..

ఇప్పటి వరకు ఉన్న బోర్లలో నీళ్లు వట్టిపోవడంతో పంటలను కాపాడుకోవడానికి కొందరు రైతులు కొత్తగా బోరుబావులను తవ్విస్తున్నారు. అయితే వెయ్యి ఫీట్ల వరకు బోరు తవ్వినా చుక్క నీరు పడటం లేదు.

పంటలు దెబ్బతిన్న గ్రామాలు..

ముషీర్‌నగర్, హుస్సేన్‌నగర్ గ్రామాల్లో సాగు నీటికి కొరత ఏర్పడింది. కొండాపూర్, తూంపల్లి, గడ్కోల్, తాటిపల్లి, మైలారం, సిరికొండ, రావుట్ల తదితర గ్రామాల్లో భూగర్భజలాలు తగ్గుముఖం పట్టాయి. ముషీర్‌నగర్, హుస్సేన్‌నగర్ గ్రామాల్లోనే వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. కొందరు రైతులు ట్యాంకర్ల ద్వారా పొలానికి నీళ్లు పారిస్తున్నారు.

రెండున్నర ఎకరాలు ఎండిపోయింది



నాలుగెకరాల్లో వరి సాగు చేశాను. బోరు ఎత్తిపోవడంతో రెండున్నర ఎకరాలు ఎండిపోయింది. మరో ఎకరంనరకు అడపాదడప నీళ్లు అందుతున్నాయి. కొత్తగా రెండు బోర్లు వేశాను. చుక్క నీరు పడలేదు. ఎండిన పొలాన్ని కోసుకుంటూ గొర్రెలకు మేతగా వేస్తున్నాను. – రాజేశ్వర్, రైతు సిరికొండ

మూడు సార్లు మోటార్ కాలిపోయింది..



బోరు బావిలో నీళ్లు పూర్తిగా తగ్గిపోయాయి. నీళ్లు వస్తాయని ఆశతో మోటార్‌ను నడిపిస్తే ఇప్పటికీ మూడు సార్లు మోటార్ కాలిపోయింది. నీళ్లు మోటారుకు అందేలా రావడం లేదు. మూడు ఎకరాల్లో పొలం సాగు చేశాను. మరో 15 రోజులు అయితే చేతికందే పంట ఎండిపోతుంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– కాయపల్లి గంగాధర్, రైతు, బాల్కొండ

గంటగంటకు బోరు కాడికి పోవాల్సి వస్తుంది..



బోరు బావిలో నీరు తగ్గడం వలన గంట గంటకు బోరు బావి వద్దకు పోవాల్సి వస్తుంది. గంటలో నీరు అయిపోతున్నాయి. మళ్లీ గంట తరువాత పోయి బోరు వేయాల్సి వస్తుంది. రెండున్నర ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. మరో 20 రోజులు నీరు అవసరం ఉంది. ఇప్పుడే బోర్లు ఎత్తిపోతున్నాయి.

– ధర్మాయి చిన్నయ్య, రైతు, బాల్కొండ

బాల్కొండలో..

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రం, చిట్టాపూర్, శ్రీరాంపూర్ గ్రామాల్లో అధికంగా బోరు బావుల ఆధారంగానే సాగు నీటి సరఫరా జరుగుతుంది. భూ గర్భజలాలు తగ్గిపోవడంతో మార్చిలోనే కొన్ని బోర్లు ఎత్తిపోయాయి. మరి కొన్ని ఎత్తిపోయే స్థితిలో ఉన్నాయి. పైపు నిండా నీటిని ఎత్తిపోసే బోర్ల నుంచి అతి సన్నని నీటి ధార వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. బోరు బావుల్లో నీరు సమృద్ధిగా లేక పోవడంతో మోటార్లు కూడా కాలిపోతున్నాయని రెతులు చెబుతున్నారు. వరి పంటలకు కనీసం ఏప్రిల్ 20 వరకు నీటి సరఫరా అవసరం ఉంటుంది. అయితే ఇప్పుడే వరి మడులకు నీటి తడి అందడం లేదు. మరో వారం, పది రోజుల్లో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం కొన్ని వరి పొలాలు ఈనిక దశలో ఉన్నాయి. కొన్ని పొలాలు పాలుపోసుకునే దశలో ఉన్నాయి. ఈ సమయంలో వరికి నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. వారం క్రితం కురిసిన అకాల వర్షంతో కొన్ని పంటలకు ఇప్పటి వరకు ప్రాణాధారమైంది. లేదంటే ఎప్పుడో ఎండిపోయేవని రైతులు అంటున్నారు.



సిరికొండలో పొలానికి ట్యాంకర్ ద్వారా నీళ్లు పెడుతున్న రైతు



బాల్కొండలో పంట భూమిలో సన్నని ధారతో బోరు

ఆలయాల పురి

- ఒక గల్లీలో 33 మందిరాలు
- నగరంలోని బ్రహ్మపురి గాజుల్‌పేట్ ప్రత్యేకత
- చారిత్రక ఆలయాలకు ప్రసిద్ధి

నగరంలోని బ్రహ్మపురి గాజుల్‌పేట్ ప్రాంతం అడుగడుగునా ఆలయాలతో కళకళలాడుతోంది. ఇక్కడ 33 మందిరాలు కొలువై ఉన్నాయి. ఎటు చూసినా భగవంతుడు దర్శనమిస్తాడు. కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని ఉంటుంది. ఏళ్ల చరిత్ర గల ఆలయాలు నేటికి దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. బ్రహ్మపురిలోని ఆలయాలపై సండే స్పెషల్..



నిజామాబాద్ సిటీ: నగరంలోని బ్రహ్మపురి గాజుల్‌పేట్ ఎన్నో చారిత్రక ఆలయాలకు ప్రసిద్ధి గాంచింది. ఏ కాలనీలోనైనా రెండు మూడు ఆలయాలు ఉంటాయి. కానీ ఇక్కడ మాత్రం 33 ఆలయాలు ఉండటం విశేషం. ఒకప్పుడు బ్రహ్మపురి గాజుల్ పేట్‌లో అనేక బ్రాహ్మణ కుటుంబాలు నివసించేవి. ఒక్కో కుటుంబం వారు ఒక్కో దేవుడిని కొలిచేవారని.. దీంతో అనేక గుళ్లు నిర్మించారని చెబుతారు. దీంతోపాటు స్థానిక ప్రజలు హనుమాన్, పోచమ్మ ఆలయాలు నిర్మించటంతో ఈ సంఖ్య మరింత పెరిగింది. ఇక్కడ ఉన్న ఒక్కో గుడికి చరిత్ర ఉండటం గమనార్హం. ఈ ప్రాంతంలో పెద్ద రామమందిరం, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, చక్రంగుడి, నగరేశ్వర ఆలయం, శ్రీదత్తా మందిరం, ఓంకారేశ్వర ఆలయం, గురుద్వార్ పురాతన ఆలయాలు.

బడా రాంమందిరం

ఛత్రపతి శివాజీ మహరాజ్ గురువు సమర్థ రామదాస్ ఈ ఆలయాన్ని నిర్మించారు. 17వ శతాబ్దంలో పెద్ద రాంమందిరాన్ని నిర్మించినట్లు చరిత్ర. ఈ గుడి బ్రహ్మచారి మఠాధిపతి సంప్రదాయంలో కొనసాగుతోంది. ఆలయాన్ని శివాజీ మహరాజ్ సందర్శించినట్లు చెబుతారు.

దత్త మందిరం

మహారాష్ట్రలోని కంధార్‌కు చెందిన శ్రీసాదుమహరాజ్ శిష్యుడు గంగాఖేడ్‌కు చెందిన శ్రీ సంతాచార్య మహరాజ్ ధర్మ ప్రచారం, భజన కీర్తనాలు చేసేందుకు ఇందూరుకు వచ్చారు. ఆయన కలలో దత్తాత్రేయుడు కనిపించి నా దర్శనానికి గానుగాపూర్‌కు రావల్సిన అవసరం లేదని, ఇక్కడే భక్తితో పూజించిన వారికి సకల కోరికలు తీరుస్తానని చెప్పాడు. దీంతో సంతాచార్యులు స్థానికుల సహకారంతో మఠాన్ని నిర్మించి దత్తాత్రేయ స్వామి విగ్రహాన్ని నెలకొల్పారు. ఏటా మార్గశిర మాసంలో 10 రోజుల పాటు దత్త జయంతి, బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు.

గురుద్వారాకు ప్రత్యేక గుర్తింపు

నిజామాబాద్‌కు చెందిన నర్సాగౌడ్ అనే వ్యాపారికి గురు గోవింద్‌సింగ్ కలలోకి వచ్చి గాజుల్‌పేట్‌లో గురుద్వారా కట్టాలని చెప్పారట. దీంతో నర్సాగౌడ్ తన సొంత డబ్బులతో గురుద్వార్ నిర్మించారు. దీనికి కృతజ్ఞతగా సిక్కులు ప్రతి సంవత్సరం హోలీ నాడు నర్సాగౌడ్ వారసులను సత్కరిస్తున్నారు.

చక్రమాచార్యులు స్థాపించిన చక్రంగుడి

గాజుల్‌పేట్‌లో 490 సంవత్సరాల క్రితం చక్రమాచార్యులు శ్రీ వేంకటేశ్వర స్వామి మందిరాన్ని నిర్మించారు. చక్రమాచార్యులు నిర్మించడంతో చక్రంగుడిగా పిలుస్తారు. శివాజీ కాలంలో బాలాజీ పేష్వార్ అనే భక్తుడు ఈ ఆలయాన్ని పెద్దగా నిర్మించారు. ఆలయంలో లక్ష్మీదేవి ఆండాళ్, రామానుజులు, నమ్మల్ అల్వాల్, గరుత్మండి విగ్రహాలు ఉన్నాయి. 180 ఏళ్ల నుంచి ఆలయంలో ధనుర్మాస కోటారి ఉత్సవాలు జరుగుతున్నాయి.

కాలనీలోని ఆలయాలు..

బ్రహ్మపురిలో వేంకటేశ్వర, నగరేశ్వర మందిరాలు, శ్రీ అరవింద్ గణేశ్ హనుమాన్ ఆలయాలు ఉన్నాయి. గణపతి ఆలయం, దుర్గామాత మందిరం, శ్రీ వేంకట విఠలేశ్వర ఆలయం, ఓంకారేశ్వర దేవాలయం, పెద్ద రాంమందిరం, గణపతి హనుమాన్ ఆలయం, శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి గుడి, శ్రీ మానిక్ ప్రభు సంస్థాన్ పీఠం, శివాలయం, శ్రీదత్తా మందిరం, బాల్సింగ్ బాబా మందిరం, శ్రీ కృష్ణ మందిరం, శ్రీ లక్ష్మీనృసింహ స్వామి గుడి, మైసమ్మ గుడి, చిలుకల చిన్నమ్మ, ముత్యాల పోచమ్మ ఆలయాలు ఉన్నాయి. వీటితో పాటు అనేక హనుమాన్ ఆలయాలు ఉన్నాయి.

నిత్యం ఆరాధనలు



బ్రహ్మపురి గాజుల్‌పేట్ అంటేనే పాత నిజామాబాద్. ఇక్కడ బ్రాహ్మణ కుటుంబాలు అనేకం ఉండటంతో బ్రహ్మపురి అని పేరు వచ్చింది. ఒక్కో బ్రాహ్మణుడు ఒక్కో దేవుడిని కొలవటం, ఆ దేవుడికి గుడి నిర్మించటంతో అనేక ఆలయాల నిర్మాణాలు జరిగాయని పూర్వీకులు చెబుతుండేవారు. ఈ ప్రాంతంలో ఆధ్యాత్మికత ఎక్కువగా ఉండేది. ప్రతి ఆలయంలో నిత్యం ఆరాధానలు చేసేవారు.

– కందాళై నరసింహమూర్తి

ఆధ్యాత్మిక వాతావరణం



అనేక దేవాలయాలు కలిగిన బ్రహ్మపురి గాజుల్‌పేట్‌లో జన్మించటం సంతోషంగా ఉంది. ఆధ్యాత్మికత కలిగిన ఈ ప్రాంతంలో పుట్టి పెరగటం ఆనందాన్ని ఇస్తోంది. కాలనీలో నిత్యం ఆలయాలకు సంబంధించి ఏదో ఒక కార్యక్రమం జరుగుతుంటుంది. దీంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది.

– అశోక్‌కుమార్, గాజుల్‌పేట్

ఏటా దత్తా బ్రహ్మోత్సవాలు



దత్తా మందిరంలో ప్రతి సంవత్సరం మార్గశిర మాసంలో దత్తా జయంతి సందర్భంగా 10 రోజుల పాటు ఘనంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తాం. ఇది పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయం.

– యోగేశ్, దత్త మందిరం 8వ వంశస్తుడు

వివాహిత దారుణహత్య



లాస్య(ఫైల్)

ఆర్మూర్ టౌన్: ఆర్మూర్‌లో పట్టపగలు వివాహిత దారుణ హత్యకు గురైంది. పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీలో శనివారం మధ్యాహ్నం రాసురి లాస్య(22)ను దుండగులు గొంతుకోసి హతమార్చారు. వివరాలు.. వేల్పూర్ మండలం వెంకటాపూర్‌కు చెందిన లాస్యకు రెండేళ్ల క్రితం ఆర్మూరుకు చెందిన రాసూరి రాకేశ్‌తో వివాహం జరిగింది. వీరికి ఏడు నెలల పాప శ్రీలక్ష్మణ ఉంది. రాకేశ్ మూడు నెలల క్రితం ఉపాధి కోసం దుబాయి వెళ్లాడు. లాస్య అత్త చిన్నుబాయితో కలిసి ఉంటుంది. శనివారం ఉదయం చిన్నుబాయి జగిత్యాల జిల్లా కోరుట్లలో గల తన కూతురు వద్దకు వెళ్లింది. లాస్య మధ్యాహ్నం ఒంటి గంట వరకు తన ఇంటి సమీపంలో ఓ ఇంట్లో బీడీలు చేసి వచ్చింది. మధ్యాహ్నం మూడు గంటల సయయంలో పాప ఏకధాటిగా ఏడుస్తుండడంతో పక్క ఇంట్లో ఉంటున్న చిట్టి అనే మహిళ వెళ్లి చూడగా లాస్య రక్తపుమడుగులో పడి ఉంది. దీంతో ఆమె స్థానికులకు చెప్పడంతో వారు అంబులెన్స్, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌హెచ్‌వో రవికుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్‌స్కా్వడ్‌తో ఆధారాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పాపను ఆడిస్తున్న కాలనీవాసులు

పాపం చిన్నారి..

రక్తం మడుగులో పడి ఉన్న తల్లి వద్ద చిన్నారి ఏడుస్తుండటం కలిచి వేసింది. తండ్రి దగ్గర లేకపోవడం, తల్లి చనిపోవడంతో ఆ పాప గుక్క పెట్టి ఏడవగా స్థానికులు అక్కున చేర్చుకొని ఓదార్చారు. కాగా ఇంట్లో ఒంటరిగా ఉన్న లాస్య హత్య తెలిసిన వారి పనే అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లాస్యను హత్య చేసిన దుండగులు మెడలో ఉన్న బంగారు నగలు, చెవి దుద్దులు ఎత్తుకెళ్లారు.

పక్కాగా పట్టాల సర్వే!

- బాల్కొండలో లబ్ధిదారుల పట్టాలను పరిశీలిస్తున్న సర్వే బృందం

బాల్కొండ: మండల కేంద్రంలోని సర్వే నంబర్ 1333లో ఉన్న ప్రభుత్వ భూమిని వెలికి తీసేందుకు అధికారులు పట్టాల సర్వేను చేపడుతున్నారు. 1995లో సర్వే నంబరు 1333లో ఉన్న ప్రభుత్వ భూమి నుంచి 300 మందికి ప్లాట్లను ప్రభుత్వం వీకర్ సెక్షన్ కింద కేటాయించింది. అవి ప్రస్తుతం కబ్జాకు గురవుతూ 3 వేల ప్లాట్ల వరకు చేరింది. దీంతో గత నెలనర రోజులుగా మండల కేంద్రంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ల్యాండ్ సర్వే వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో సర్వేయర్ల బృందం సర్వేను చేపడుతోంది. సర్వేపై అనేక అనుమానాలు రావడంతో ఎన్టీఆర్ కాలనీలో ప్రస్తుతం నివాసం ఉంటున్న లబ్ధిదారుల నుంచి ఒరిజనల్ పట్టాలను తెప్పించుకుని సర్వే బృందం పరిశీలిస్తోంది. దీంతో నిజమైన పట్టాలు ఎవరి వద్ద ఉన్నాయో తేలుతుందని అధికారులు భావిస్తున్నారు.

అనేక మలుపులు తిరుగుతున్న సర్వే..

సర్వే నంబరు 1333లో ప్రభుత్వం 224.19 ఎకరాలు ఉంది. అందులో నుంచి ఇప్పటి వరకు సుమారుగా మూడు ఎకరాల కంటే ఎక్కువగా కబ్జాకు గురైంది. మిగతా కొన్ని చోట్ల నకిలీ పట్టాలు ఇస్తు ప్లాట్లుగా ఏర్పాటు చేస్తున్నారు. సర్వే కొనసాగుతున్నా నకిలీ పట్టాలు ఇస్తుండటంతో సర్వే అనేక మలుపులు తిరుగుతోంది. భూమి సర్వేతో పాటు పట్టాల సర్వే చేపట్టాల్సి వచ్చింది. సర్వే చేసిన బృందం వారం రోజుల వ్యవధిలోనే హద్దులు మార్చి మార్చి పెట్టడం మరింత అనుమానాలకు తావిస్తోంది. దీంతో గ్రామంలో కొందరు సర్వే భూకబ్జాదారులకు అనుకూలంగా చేపట్టారని ఉన్నతాధికారుల వరకు ఫిర్యాదు చేశారు. పలుమార్లు ఉన్నతాధికారులు వచ్చి సర్వేను పర్యవేక్షిస్తున్నా ఏ ఒక్కటి కొలిక్కి రావడం లేదు.



ఎన్టీఆర్ కాలనీలో పట్టాలను పరిశీలిస్తున్న డీఐ, సర్వేయర్ల బృందం

నకిలీ పట్టాలు ఎన్నో..

ప్రభుత్వ భూమిని కబ్జా చేసి నకిలీ పట్టాలను తయారు చేసి కొందరు యథేచ్ఛగా విక్రయించారు. దీతో ప్రస్తుతం ప్రతి ఇంటికి చేపడుతున్న పట్టాల సర్వేలో పట్టాలు ఒక రకంగా లేవు. ఒకే అధికారి సంతకాలు లేవు. కానీ పట్టాలు జారీ చేసింది మాత్రం ఒకే సారి. ఇదంతా ఓపెన్ సీక్రెట్. కానీ ఇప్పటి వరకు సంతకాలను ఫోర్జరీ చేసి పట్టాలను విక్రయించిన ఒక్కరిపై కూడా అధికారులు ఎలాంటి కేసులు నమోదు చేయలేదు. సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నారు. ఇంటింటికి పట్టాల సర్వేతోనైనా పట్టాల బాగోతం బయట పడుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అనుమానాలు వద్దు..

మండల కేంద్రంలో చేపడుతున్న పట్టాల, భూమి సర్వేపై గ్రామస్తులు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దు. సర్వేను సక్రమంగానే నిర్వహిస్తున్నాం. ఇంటికి తిరిగి పట్టాలతో విచారణ చేపడుతున్నాం. జిరాక్స్‌లను సేకరిస్తున్నాం. నకిలీ పట్టాలు దొరికితే ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– వెంకటేశ్వర్లు, డీఐ, నిజామాబాద్

క్లుప్తంగా

ఉద్యోగం ఇప్పించాలని..



నవీపేట: గ్రామపంచాయతీలో అటెండర్‌గా విధులు నిర్వర్తించిన తనను అకారణంగా విధుల నుంచి తొలగించారని లలిత అనే మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. అనారోగ్యంతో బాధపడుతున్న తన భర్తతో కలిసి మండల పరిషత్‌ కార్యాలయానికి శనివారం వచ్చింది. తన భర్త శంకర్‌ అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఆర్థిక ఇబ్బందులతోపాటు కుటుంబ పోషణ భారమైందని, తన ఉద్యోగం తనకు ఇప్పించాలని అధికారులను వేడుకుంది.

పిల్లలను లైంగికంగా వేధిస్తే పోక్సో కేసు



ఖలీల్‌వాడి: పిల్లలను లైంగికంగా వేధిస్తే పోక్సో కేసు నమోదు చేయాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌ హాల్‌లో పోక్సో, ఎన్‌డీపీఎస్‌ చట్టాలపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల హాజరై చట్టాలపై ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించాలన్నారు. పోక్సో, ఎన్‌డీపీఎస్‌ ద్వారా విధించే శిక్షలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌, సీపీ కల్మేశ్వర్‌ సింగన్వార్‌, జిల్లా న్యాయ సేవాధికారసంస్థ సెక్రెటరీ పీ పద్మావతి, గోపాలకృష్ణ గోఖలే, న్యాయమూర్తులు కుష్బూ ఉపాధ్యాయ, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్‌ ఫైనల్స్‌కు జిల్లా జట్టు



నిజామాబాద్‌నాగారం: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో కొనసాగుతున్న 8వ రాష్ట్ర సబ్‌ జూనియర్‌ బాలుర సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో ఫైనల్స్‌కు చేరింది. లీగ్‌ మ్యాచుల్లో కొత్తగూడెం, సిరిసిల్ల, నిర్మల్‌, కరీంనగర్‌ జట్లపై, క్వార్టర్‌ ఫైనల్‌లో వరంగల్‌ జట్టుపై 12 – 0 పరుగుల తేడాతో విజయం సాధించింది. సెమీ ఫైనల్స్‌లో హనుమకొండ జట్టుపై 13 – 0 పరుగుల తేడాతో గెలుపొంది ఫైనల్స్‌కు చేరినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు విప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్‌ తెలిపారు. జట్టుకు కోచ్‌, మేనేజర్లుగా మర్కంటి గంగామోహన్‌, ఈ నరేశ్‌, గంగాధర్‌ వ్యవహరిస్తున్నారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న పరీక్షలు

నిజామాబాద్‌ అర్బన్‌: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 141 పరీక్ష కేంద్రాల్లో శనివారం పరీక్ష కొనసాగగా, 22,135 మంది విద్యార్థులకుగాను 22,081 మంది హాజరుకాగా, 54 మంది గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌ తొమ్మిది, జిల్లా స్థాయి అబ్జర్వర్లు ఏడు పరీక్షాకేంద్రాలను తనిఖీ చేశారు.

పిడిగుద్దుతో వసంతోత్సవం

- హోలీ సందర్భంగా హున్సాలో ఏర్పాట్లు
- దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయం

వసంత రుతువు రాకకు గుర్తుగా సంబురంగా నిర్వహించే హోలీ.. ఆ గ్రామంలో పిడిగుద్దులకు వేదిక అవుతుంది. గ్రామ శ్రేయస్సు కోసం యువత, పెద్దలు రెండుగా విడిపోయి ఒకరిపైఒకరు పిడిగుద్దులు కురిపించుకుంటారు. ఎలాంటి భేదభావం లేకుండా ఐక్యమత్యంతో పూర్వీకుల కాలం నుంచి 'పిడిగుద్దులాట'ను కొనసాగిస్తున్నారు.

బోధన్‌రూరల్‌(బోధన్‌) : తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దులోని మంజీర తీరంలో ఉన్న హున్సా గ్రామం పిడిగుద్దులాటతో ప్రత్యేక గుర్తింపు పొందింది. దేశంలో ఎక్కడాలేని విధంగా హోలీ పండుగ రోజున పిడిగుద్దులాట నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ కులమత, వయోబేధం లేకుండా దశాబ్దాలుగా ఐక్యతతో పిడిగుద్దులాటను నిర్వహిస్తున్నారు. పోలీసుశాఖ అభ్యంతరం తెలుపుతున్నా..



పిడిగుద్దులాట ఆడుతున్న హున్సా గ్రామస్తులు (ఫైల్‌)

తమ గ్రామ శ్రేయస్సుకోసం 'పిడి గుద్దులు' తప్పవని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు.

కామదహనం, కుస్తీ పోటీలు

హోలీని పురస్కరించుకొని హున్సాలో ఆదివారం రాత్రి (నేడు) కామదహనం నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం నుంచి హోలీ సంబురాలు జరుపుకుంటారు. మధ్యాహ్నం వరకు రంగులాటను ముగించి గ్రామ శివారులో పెద్దఎత్తున కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. కుస్తీ పోటీల్లో పాల్గొనేందుకు మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన మల్లయోధులు, తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి యువకులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.

సాగేదిలా..

గ్రామంలోని హనుమాన్‌ ఆలయం ఎదుట ఉన్న ఖాళీ ప్రదేశం పిడిగుద్దులాటకు వేదిక. గ్రామశివారులో కుస్తీ పోటీలు ముగియగానే డప్పు చప్పుళ్ల మధ్య గ్రామస్తులు, యువకులు కేరింతలు కొడుతూ గ్రామ పెద్దల ఇళ్లకు వెళ్లి వారిని పిడిగుద్దులాట వేదిక వద్దకు తీసుకొస్తారు. అక్కడి చేరుకోగానే, పెద్దల సూచనతో రెండుగా విడిపోయి పిడిగుద్దులాట కోసం ఏర్పాటు చేసిన తాడుకు ఇరువైపుల మోహరిస్తారు. గ్రామపెద్దల సంకేతంతో 'పిడిగుద్దులాట'ను ప్రారంభించి ఎడమ చేయితో తాడును పట్టుకుని కుడిచేయి పిడికిలితో ఒకరినొకరు బాదుకుంటారు. ఈ సమయంలో కేరింతలతో పిడిగుద్దులాట వేదిక దద్దరిల్లుతుంది. సుమారు 10 నుంచి 20 నిమిషాలపాటు పిడ్డిగుద్దులాట కొనసాగుతుంది. అనంతరం గ్రామస్తులు అంతా మరిచిపోయి ఎప్పటిలాగే ఒకరినొకరు ఆలింగనం చేసుకొని హోలీ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. బోధన్‌ డివిజన్‌కు చెందినవారితోపాటు మహారాష్ట్ర చుట్టు పక్కల మండలాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. గ్రామంలో పెద్ద ఎత్తున జాతర కొనసాగుతుంది.

సంప్రదాయానికి నిదర్శనం



పిడిగుద్దులాట మా గ్రామ సంప్రదాయానికి నిదర్శనం. కులమతలు, చిన్నాపెద్ద తేడాలేకుండా గ్రామస్తులందరం పిడిగుద్దులాట ఆడతాం. పిడిగుద్దులాట నిలిపివేస్తే గ్రామానికి మంచిదికాదనే పూర్వీకుల మాటను పాటించి ఐక్యమత్యంతో, సోదరభావంతో పండుగను జరుపుకుంటాం.

– చిల శంకర్‌, మాజీ ఎంపీటీసీ, హున్సా

గ్రామం సుభిక్షంగా ఉండాలని..



గ్రామంలో పిడిగుద్దులాట నిర్వహించడం దశాబ్దాలుగా గ్రామ ఆనావాయితీ. మా పూర్వీకుల నుంచి వచ్చిన పిడిగద్దులాటను నిర్వహిస్తే గ్రామానికి మేలు జరుగుతుందని మా నమ్మకం. గ్రామం సుభిక్షంగా ఉండాలని గ్రామంలో ప్రతి ఏటా హోలీ పండుగ రోజున పిడిగుద్దులాటను నిర్వహిస్తున్నాం.

– పల్లె గంగారాం, గ్రామపెద్ద, హున్సా

పరామర్శించి పరీక్షకు తీసుకెళ్లి..



ఫొటోలో కనిపిస్తున్న విద్యార్థి పేరు శివకుమార్‌. గుండారం ప్రాథమిక పాఠశాలలో పదో తరగతి చదివాడు. ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతుండగా, శివకుమార్‌ తండ్రి గంగాధర్‌ బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. పుట్టెడు దుఃఖంలో శివకుమార్‌ గురువారం నిర్వహించిన ఇంగ్లిష్‌ పరీక్షరాయగా, అతడు ఇంటికి వచ్చిన తరువాత అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రిని కోల్పోయిన బాధలో ఉన్న శివకుమార్‌ను పరీక్ష కేంద్రం చీఫ్‌ సూపరింటెండెంట్‌ రామ్మోహన్‌, ఇన్విజిలేటర్‌ ఆరోగ్యరావు శనివారం ఉదయం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆత్మస్థైర్యంతో పరీక్షరాయాలని సూచించారు. శివకుమార్‌ను తమ వెంట పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు.

– నిజామాబాద్‌ రూరల్‌

వ్యాక్సినేషన్‌ పరిశీలన



సిరికొండ: మండలంలోని న్యావనందిలో వ్యాక్సినేషన్‌ కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్‌ అధికారి అశోక్‌ శనివారం తనిఖీ చేశారు. గర్భిణులకు, బాలింతలు, చిన్నారులకు ఇబ్బందులు రాకుండా వ్యాక్సిన్‌లు వేయాలని సిబ్బందికి సూచించారు. మెడికల్‌ ఆఫీసర్‌ అరవింద్‌, ప్రోగ్రాం ఆఫీసర్‌ తరుణ్‌, సూపర్‌వైజర్‌ మేరీ, ఏఎన్‌ఎంలు ఝాన్సీ, అరుణకుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

స్నేహితులతో ఈతకు వెళ్లి కానరాని లోకాలకు..



మోసిన్‌(ఫైల్‌)

నవీపేట: స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన విద్యార్థి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని బర్కత్‌పురా కాలనీకి చెందిన మహ్మద్‌ మోసిన్‌(13) శుక్రవారం పాఠశాల ముగియగానే స్నేహితులతో కలిసి దగ్గరలోని అలీసాగర్‌ కాలువలో ఈతకు వెళ్లి నీటిలో గల్లంతయ్యాడు. నీటి విడుదలను నిలిపివేసి వెతుకగా, రాత్రి వేళలో మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి హైమద్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మోసిన్‌ స్థానిక స్కాలర్స్‌ మోడల్‌ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు.

చేపల వేటకు వెళ్లి..

నందిపేట్‌ (ఆర్మూర్‌): చేపల వేటకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన మండలంలోని కౌల్‌పూర్‌ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్టీఆర్‌ నగర్‌ కాలనీకి చెందిన బండారి రవి (20) స్నేహితులతో కలిసి తల్వేద శివారులోని వాగులో చేపల వేటకు వెళ్లాడు. రవి ప్రమాదవశాత్తు వాగు బ్రిడ్జి పైనుంచి కాలుజారి నీటిలో పడిపోయి మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై రాహుల్‌ తెలిపారు.

పశువుల కాపరి..

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): మండల కేంద్రానికి చెందిన సుంకరి పెద్దగంగారాం (44) ప్రమాదవశాత్తు ఊర చెరువులో పడి మృతి చెందాడు. ఎస్సై రాహుల్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశువుల కాపరి గంగారాం శనివారం ఊర చెరువు వద్దకు పశువులను తీసుకెళ్లాడు. చెరువులోకి దిగిన పశువులను బయటకు కొట్టేందుకు ప్రయత్నిస్తూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. మృతుడికి భార్య సాయమ్మతోపాటు ఇద్దరు కుమారులున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

ధర్పల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్సై విక్రమ్‌ తెలిపారు. నిజామాబాద్‌లో కంప్యూటర్‌ క్లాస్‌కు వెళ్తున్నాని ఈనెల 21న ఇంటి నుంచి వెళ్లిన యువతి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్‌ చేయగా స్విచ్ఛాఫ్‌ రావడంతో చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన యువతి..

ఎల్లారెడ్డి: మండలంలోని తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన సంధ్యారాణి ఈనెల 22న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాక పోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్‌ కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్‌ శనివారం తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ సంధ్యారాణి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



రామారెడ్డి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌ కొండ తెలిపారు. శనివారం వేకువజామున స్కూల్‌ తండా నుంచి రెడ్డి పేట గ్రామానికి ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఘన్‌పూర్‌ రోడ్డువద్ద పట్టుకున్నారు.

దేవునిపల్లి పీఎస్‌ పరిధిలో..

కామారెడ్డి క్రైం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను దేవునిపల్లి పోలీసులు పట్టుకున్నారు. కామారెడ్డి మండలం గూడెం నుంచి జిల్లా కేంద్రానికి ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తుండగా పట్టణ శివారులో పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. ట్రాక్టర్‌ను మైనింగ్‌ అధికారులకు అప్పగిస్తామన్నారు.

రూ.50వేల జరిమానా..

జక్రాన్‌పల్లి: ఈ నెల 22న అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను మండలంలోని బాలనగర్‌లో పట్టుకుని ఎస్సై తిరుపతి కేసు నమోదు చేశారు. అనంతరం జిల్లా మైన్స్‌ అధికారులకు అప్పగించగా, వారు టిప్పర్‌కు రూ.50వేల జరిమానా విధించారు. టిప్పర్‌ను కోర్టులో డిపాజిట్‌ చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

వాహనాల తనిఖీ

ఎల్లారెడ్డిరూరల్‌(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్‌ అమలులో ఉండడంతో ఎస్సై మహేష్‌ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు 50 వేలకు మించి డబ్బులను వెంట తీసుకుని వెళ్ళరాదని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై నర్సింగ్రావు తదితరులున్నారు.

చెరువులో యువకుడి గల్లంతు..

- జగిత్యాల జిల్లాలో ఘటన



నాకేపు శివ (ఫైల్‌)

మాక్లూర్‌: మండలంలోని ధర్మోరాకు చెందిన సాయినోల్ల నాకేపు శివ (22) జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మిట్టాపూర్‌ చెరువులో గల్లంతయ్యాడు. శివ గత కొంత కాలంగా డైలీ ఫైనాన్స్‌లో పని చేస్తున్నాడు. తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుక ఉందని రాత్రికి అక్కడే ఉండి శనివారం వస్తానని ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పి శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి అక్కడే ఉన్న శివ శనివారం ఉదయం స్నేహితులతో కలిసి చెరువులో స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు కోరుట్లకు తరలివెళ్లారు.

బైక్‌ ఢీకొని ఒకరికి గాయాలు

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని బోర్గాం(పి) వద్ద నడుచుకుంటూ వెళ్తున్న బేగరి స్వామి(48)ని మోపాల్‌ వైపు నుంచి వస్తున్న బైక్‌ ఢీకొట్టింది. ఈ ఘటనలో స్వామికి బలమైన గాయాలయ్యాయి. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు బైక్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడిపిన అశ్విన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంజీవ్‌ తెలిపారు.

విద్యుత్‌ షాక్‌తో..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటోటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని పూసలగల్లీలో శనివారం విద్యుత్‌షాక్‌తో ఒకరికి గాయాలయ్యాయి. అజ్మతుల్లాఖాన్‌(50), కృష్ణ(20) గణపతి టెక్స్‌టైల్‌ పైన మరమ్మతులు చేస్తుండగా విద్యుత్‌ వైర్లు తగిలాయి. గాయాలపాలైన ఇరువురిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యుత్‌ అధికారుల అనుమతులు లేకుండా మరమ్మతులు చేయించిన గణపతి టెక్స్‌టైల్స్‌ యజమాని కన్న రాజుపై ఏడీ రాజశేఖర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు.

పల్లెలపై సైబర్‌ నేరగాళ్ల వల



- అమాయకులే లక్ష్యంగా సైబర్‌ మోసాలు
- ఫోన్లు చేసి నమ్మించి సొమ్ము కాజేత..
- మోసపోతే 1930కి కాల్‌ చేయాలంటున్న పోలీసులు

దోమకొండ: రోజూ ఏదో ఒకచోట సైబర్‌ నేరగాళ్ల వలకు అమాయకులు చిక్కుతున్నారు. ఒకప్పుడు పట్టణాల్లోనే వినిపించిన సైబర్‌ మోసాలు ఇప్పుడు పల్లెల్లో ఎక్కువగా వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల అమాయకులే లక్ష్యంగా సైబర్‌ నేరాలకు పాల్పడుతున్నారు. సాంకేతికతను ఆధారం చేసుకొని తాము బ్యాంకర్లమని, లాటరీ కంపెనీ నుంచి మాట్లాడుతున్నామంటూ నమ్మిస్తూ సొమ్ము కొల్లగొడుతున్నారు. మోసపోతున్న చాలా మంది యువకులు బయటికి చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోండిలా..

అనుమానాస్పద కాల్స్‌కు స్పందించకూడదు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు గుర్తు తెలియని వ్యక్తులకు చెప్పొద్దు. మెయిల్స్‌, వాట్సాప్‌, ఫేస్‌బుక్‌ ద్వారా వచ్చే లింక్‌లను క్లిక్‌ చేయొద్దు. సామాజిక మాధ్యమాల్లో కనిపించే అప్లికేషన్లను ఫోన్లలో డౌన్‌లోడ్‌ చేసుకోవద్దు. వర్క్‌ఫ్రం హోం వంటి కాల్స్‌ను గుడ్డిగా నమ్మొద్దు.

కాల్‌ టు 1930

సైబర్‌ మోసానికి గురైనవెంటనే 1390కి కాల్‌ చేసి సమాచారం అందించాలి. బ్యాంకు అధికారులకు సైతం సమాచారం అందిస్తే వారు ఖాతాను ఫ్రీజ్‌ చేస్తారు. తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఖాతా నుంచి పోయిన నగదును వెనక్కి రప్పించే అవకాశం ఉంటుంది.

అవగాహన కల్పిస్తున్నాం



సైబర్‌ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిసున్నాం. ఇటీవల పల్లెల్లో సైబర్‌ మోసాలు బాగా జరుగుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అనుమానాస్పద ఫోన్‌కాల్స్‌, మెయిల్స్‌కు స్పందించొద్దు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

– చిందం గణేశ్‌, ఎస్సై, దోమకొండ

ఇటీవల జరిగిన మోసాలు..

సాఫ్ట్‌వేర్‌ జాబ్‌పేరుతో..

దోమకొండ మండల కేంద్రానికి చెందిన నిరుద్యోగికి ఇటీవల ఓ సాఫ్ట్‌వేర్‌ కంపెనీ పేరుతో జాబ్‌ ఆఫర్‌ మెయిల్‌ వచ్చింది. సదరు యువకులు ఉద్యోగం కోసం అప్లై చేయగా, అవతలి వ్యక్తులు ఆన్‌లైన్‌లోనే ఎగ్జామ్‌, ఇంటర్వ్యూ నిర్వహించారు. జాబ్‌ కోసం రూ.2లక్షల 70వేలు చెల్లించాలని సూచించి నమ్మించారు. యువకుడు డబ్బులు చెల్లించి జాబ్‌కోసం హైదరాబాద్‌లోని కంపెనీ హెడ్‌ ఆఫీస్‌కు వెళ్లగా తాము అసలు ఇంటర్వ్యూ నిర్వహించలేదని సంస్థ ప్రతినిధులు తెలుపడంతో తాను మోసపోయాయని యువకుడు గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు.

తక్కువ ధరకే కారు ఆశ చూపి..

దోమకొండ మండలం చింతమాన్‌పల్లికి చెందిన వ్యక్తికి తక్కువ ధరకే స్విఫ్ట్‌ డిజైర్‌ కారు వస్తుందని ఆన్‌లైన్‌లో ఆఫర్‌ వచ్చింది. ఆఫర్‌ చేసిన వ్యక్తి వివరాలు ఆర్మీ ఐడీ కార్డుతో ఉండడంతో నమ్మాడు. అవతలి వ్యక్తి జీఎస్టీ, ఆన్‌లైన్‌ సర్వీస్‌ చార్జ్‌ పేరుతో రూ.లక్షా 30వేలు కట్టించుకున్నారు.అనంతరం తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

'నోరు అదుపులో పెట్టుకోవాలి'



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌

సుభాష్‌నగర్‌: కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌కులాచారి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, ఎంపీ అర్వింద్‌, బీజేపీపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోమన్నారు. శనివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రజల కు ఎంపీ అర్వింద్‌పై విశ్వాసం ఉందని, పసుపు ధర రూ.20వేలు పలుకుతుండడంతో రైతుల హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కాంగ్రెస్‌ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సాగు తగ్గడంతో ధర పెరిగిందని అంటున్నారని, కానీ అంతర్జాతీయంగా పెరుగుతున్న ధరకు, రాష్ట్రంలో సాగు తగ్గడానికి పొంతన లేదన్నారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్‌ వెంటనే అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. ఎంపీ అభ్యర్థి ఎవరో కాంగ్రెస్‌కు ఇప్పటి వరకు తెలియదని, బీఆర్‌ఎస్‌ అభ్యర్థికి డిపాజిట్‌ రాదని ఎద్దేవాచేశారు. బీజేపీ ఓట్లు చీల్చడానికే బాజిరెడ్డి బరిలో ఉన్నారని ఆరోపించారు. ఆర్‌వోబీల జాప్యానికి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వమే కారణమని, ముందుగా ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే బీఆర్‌ఎస్‌ అభ్యర్థి నామినేషన్‌ వేయాలని డిమాండ్‌ చేశారు. నాయకులు లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పద్మారెడ్డి, ప్రమోద్‌, మాస్టర్‌ శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్‌ కానిస్టేబుల్‌ ఇంట్లో చోరీ

- ఉదయం 10 గంటలకు ఘటన
- బంగారం, వెండి, నగదు అపహరణ



ఇంట్లో చిందరవందరగా పడిఉన్న వస్తువులు

నిజామాబాద్‌రూరల్‌: మండలంలోని గూపన్‌పల్లిలో నివాసముంటున్న ఏఆర్‌ కానిస్టేబుల్‌ ఇంట్లో దుండగులు శనివారం ఉదయం 10 గంటలకు చోరీకి పాల్పడ్డారు. రూరల్‌ ఎస్‌హెచ్‌వో మహేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. జానకంపేటలోని ట్రెయినింగ్‌ సెంటర్‌లో విధులు నిర్వర్తించే ఏఆర్‌ కానిస్టేబుల్‌ సాయన్న శనివారం ఉదయం డ్యూటీపై వెళ్లగా, అతడి భార్య భూలక్ష్మి పని నిమిత్తం దూపల్లి గ్రామానికి వెళ్లింది. ఇంటి తాళాన్ని పగులగొట్టిన దుండగులు లోనికి ప్రవేశించి ఆరున్నర తులాల బంగారం, 25 తులాల వెండి, రూ.29 వేల నగదు ఎత్తుకెళ్లారు. కొద్దిసేపటి తరువాత గమనించిన స్థానికులు వెంటనే సాయన్నకు సమాచారం అందించారు. ఇంటికి చేరుకున్న సాయన్న చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని రూరల్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ట్రెయినీ ఐపీఎస్‌ చైతన్యరెడ్డితోపాటు ఎస్సై ఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రైవర్లపై మత్తుమందు చల్లి..



దుండగులు తొలగించిన బీడింగ్‌

భిక్కనూరు: మండలంలోని జాతీయ రహదారిపై లారీలు నిలిపి నిద్రిస్తున్న డ్రైవర్లపై దుండగులు మత్తుమందు చల్లి చోరీలకు పాల్పడుతున్నారు. గత మూడురోజులుగా చోరీ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. భిక్కనూరు సమీపంలోని సిద్ధరామేశ్వర నగర్‌ శివారులో జాతీయ రహదారి లే బైలో స్థానికుడికి చెందిన రెండు లారీలను నిలిపి డ్రైవర్లు నిద్రకు ఉపక్రమించారు. దుండగులు లారీల బీడింగ్‌ను తొలగించి డ్రైవర్లపై మత్తు మందు చల్లారు. ఓ డ్రైవర్‌ వద్ద నుంచి రూ.2,500, మరో డ్రైవర్‌ వద్ద నుంచి రూ.2వేలతోపాటు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. అలాగే శుక్రవారం రాత్రి మండల కేంద్రానికి చెందిన డీసీఎం వ్యాన్‌ను స్థానిక పెట్రోల్‌ పంప్‌లో నిలిపి డ్రైవర్‌ దుబ్బయ్య నిద్రించాడు. గుర్తు తెలియని వ్యక్తి పెట్రోల్‌ పంప్‌ ప్రహరీపై నుంచి దూకి వ్యాన్‌ అద్దం బీడింగ్‌ను తొలగించాడు. డ్రైవర్‌కు మెలకువ వచ్చి అరవడంతో దుండగుడు పరారయ్యాడు. చోరీ యత్నానికి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి.

తల్లిదండ్రులకు అక్కాచెల్లెళ్ల అప్పగింత



బాలికతోపాటు చిన్నారిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

రెంజల్‌(బోధన్‌): తన చిన్నారి చెల్లితో తప్పిపోయి వచ్చిన బాలికను రెంజల్‌ పోలీసులు తిరిగి తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. వర్ని మండల కేంద్రానికి చెందిన అక్కాచెల్లెళ్లు ఇందు, సంగీత శుక్రవారం రాత్రి బోధన్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌ నుంచి కందకుర్తి నైట్‌హాల్ట్‌ బస్సులో కందకుర్తికి చేరుకున్నారు. స్థానికులు గమనించి ఆరా తీశారు. తప్పిపోయి వచ్చారని నిర్ధారించుకొని పేపర్‌మిల్‌లోని ఓ వృద్ధురాలి వద్ద ఉంచి భద్రత కల్పించారు. శనివారం వర్ని పోలీసులకు సమాచారం అందించగా వారు తల్లిని తీసుకుని రెంజల్‌రాగా, పిల్లలను తల్లికి అప్పగించారు.